

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 21-02-2023 సంపుటి : 04 సంచిక : 156 పేజీలు : 4 వెల : రూ 3-00

# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ సమావేశాలు



విజయవాడ, ఫిబ్రవరి 20, ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి చివరి వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27 నుంచి బడ్జెట్ సమావేశాలు జరపనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. అయితే ఈసారి రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. తొలుత రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. మొదటి రోజున గవర్నర్ ప్రసంగం, బీఏసీ సమావేశం ఉంటాయి. రెండో రోజు సంతాప తీర్మానాలు, వాయిదా ప్రకటన ఉంటాయి. రెండో విడత సమావేశాలు మార్చి 6న ప్రారంభం అవుతాయి. బడ్జెట్ సమావేశాలు 13 రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. విశాఖలో మార్చి 3, 4 తేదీల్లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలోనే, అసెంబ్లీ సమావేశాలు రెండు విడతల్లో జరపనున్నట్టు చెబుతున్నారు. బడ్జెట్‌ను ఎప్పుడు ప్రవేశ పెడతారన్నదానిపై స్పష్టత లేదు. రెండో విడత సమావేశాల్లోనే పెట్టే అవకాశం ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ 2,56,256 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది ఏపీ ప్రభుత్వం. ఈసారి అంతకు మించి బడ్జెట్ లెక్కలు ఉండాలని మంత్రి బుగ్గన అధికారులకు సూచనలు చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 2.65 లక్షల కోట్ల నుంచి2.75 లక్షల కోట్ల రూపాయల మధ్య ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని శాఖలకు సంబంధించిన ఉన్నత అధికారులు అంచనాలు రూపొందించుకోనున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు.. అవసరమైన మేరకే.. నిధులను కోరాల్సిందిగా సూచిస్తున్నారు. గత ఏడాది తరహాలోనే సంక్షేమానికి పెద్ద పీట వేయాలని ప్రభుత్వం స్పష్టంగా భావిస్తుంది. అంతే కాదు వచ్చేది అంతా ఎన్నికల సమయమే కాబట్టి.. సంక్షేమానికి ఒకింత ఎక్కువే ఇవ్వాలి కాని, లోటు ఉండొద్దని ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులకు ప్రభుత్వ పెద్దలు సూచించారు. ఇక అభివృద్ధి విషయంలోనూ ఈసారి ఎక్కువగా ఫోకస్ పెట్టక తప్పని సరి పరిస్థితి ఏర్పడింది.అత్యంత ప్రాదాన్యత కలిగిన రోడ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో రోడ్లకు భారీగానే నిధుల కేటాయింపు జరపాల్సి ఉంటుంది. అలాగే గృహ నిర్మాణంలోనూ ఇటీవల కాలంలో ప్రభుత్వం పై విమర్శలు వచ్చాయి. ఇళ్ల నిర్మాణం విషయంలో కూడ టార్గెట్‌ను రీచ్ కాలేకపోతుందని.. కేవలం పది శాతం ఇళ్లను మాత్రమే కట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలతో హాల్ చల్ చేస్తున్నాయి. దీంతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన నిధులను కేటాయించకుంటే.. ఎన్నికల నాటికి ఇళ్ల నిర్మాణం హామీని అమలు చేయలేకపోయామనే విమర్శలు ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టే ప్రమాదం లేకపోలేదు. గృహ నిర్మాణ శాఖకు భారీగానే నిధులు కేటాయించాల్సి ఉంది. ఇదే తరహాలో ఇరిగేషన్‌కు కూడా నిధుల ఎక్కువే కావాల్సి ఉంటుంది.ఒక వైపు సంక్షేమానికి.. మరోవైపు అభివృద్ధికి అదిక నిధుల కేటాయింపులే చేయాల్సిందేనన్న విషయం స్పష్టం అవుతుంది.ఆదాయార్జన శాఖలపై ప్రధానంగా ఫోకస్ పెట్టాల్సి ఉంటుందని అదికార వర్గాలు అంటున్నాయి. ఈ క్రమంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ, మైనింగ్, రెవెన్యూ వంటి వాటి నుంచి మరింత ఆదాయాన్ని సమకూర్చుకునే దిశగా ప్రణాళికలను తప్పని సరిగా రెడీ చేసుకోవాలి.అంతే కాదు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగానే కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వాలని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలుగా లేని కేంద్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు కేటాయించడం వల్ల రాష్ట్రానికి ఒరిగేదేం ఉండదనే అభిప్రాయం కూడ లేకపోలేదు. ఈ క్రమంలో విద్య, వైద్యం వంటి రంగాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతాంశాలుగా తీసుకుంటున్నందున ఈ రంగాలకు సంబంధించి కేంద్రం నుంచి ఎంత మేరకు నిధులను రాబట్టగలమనే అంచనాలను కూడా సిద్దం చేస్తున్నారు ఆయా శాఖలకు చెందిన అధికారులు.ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ.. అత్యంత ప్రాధాన్యంగా ఏయే అంశాలనైతే ప్రభుత్వం భావిస్తుందో.. వాటికి పెద్ద పీట వేసే దిశగా బడ్జెట్ కూర్పు ఉండబోతోంది.

## అమరరాజా బ్యాటరీస్‌పై ప్రజాభిప్రాయసేకరణ జరపండి: సుప్రీం కోర్టు



దిల్లీ: ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న అమరరాజా బ్యాటరీస్ కాలుష్య వ్యవహారంపై సుప్రీం కోర్టు లో విచారణ జరిగింది.ఏపీ కాలుష్య నియంత్రణ మండలి షోకాజ్ నోటీసులపై గతంలో ఇచ్చిన స్టేను అత్యున్నత న్యాయస్థానం ఎత్తివేసింది. అయితే, సంస్థ మూసివేతపై హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ కొనసాగుతుందని జస్టిస్ అజయ్ రాస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.అమర రాజా బ్యాటరీస్ తీవ్ర కాలుష్యం వెదజల్లుతోందని, దీనివల్ల పరిసర ప్రాంతాల జలాల్లో సీసం ధాతువులు పెరుగుతున్నందున సంస్థను మూసివేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గతంలో షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సదరు నోటీసులపై చట్ట ప్రకారం ముందుకు వెళ్లవచ్చని హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ బ్యాటరీస్ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాజకీయ కారణాలతో ఇప్పటి వరకు 34సార్లు నోటీసులు ఇచ్చి తమను వేధిస్తున్నారని అమర రాజా తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, ఆదినారాయణరావు సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. షోకాజ్ నోటీసులపై చట్టప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ జరిపి నిర్ణయం తీసుకోవాలని పీసీబీకి సుప్రీం కోర్టు ఆదేశించింది. నోటీసులపై న్యాయ పరిష్కారాల కోసం ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత జారీ చేసే ఉత్తర్వులను నాలుగు వారాల పాటు నిలుపుదల చేయాలని తెలిపింది.

# ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం జగన్ భేటీ..



గుంటూరు: వైఎస్సార్‌సీపీ తరఫున స్థానికసంస్థల కోటా సీట్లకు ఎమ్మెల్యే అభ్యర్థులు, గవర్నర్ కోటాలో ప్రతిపాదిత వ్యక్తులతో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు.ఎప్పుడూ జరగని విధంగా సామాజిక న్యాయాన్ని చేస్తున్నామని, దేవుడి దయతో అది మన పార్టీలో మనం చేయగలుగుతున్నామని, ఈ

## చేయాల్సింది చేశానంటూ కీలక వ్యాఖ్యలు

విషయాన్ని మనం గర్వంగా చెప్పుకోగలమని ఈ సందర్భంగా ఆయన వాళ్లను ఉద్దేశించి పేర్కొన్నారు.ఇవాళ మొత్తం 18 మంది పేర్లను ఖరారు చేశాం. వీళ్లలో 14 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన వాళ్లే ఉన్నారు. మిగిలిన వాళ్లకు నాలుగు సీట్లు ఇచ్చాం. ఇందులో కూడా ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కటి ఇచ్చాం. మనం చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకూ తెలియాలి. ప్రతి నియోజకవర్గంలో చెప్పాలి. ఇంత గొప్ప మార్పు ఎప్పుడూ జరగలేదు అని అభ్యర్థులను ఉద్దేశించి సీఎం జగన్ పేర్కొన్నారు.ఎమ్మెల్సీలుగా బాధ్యతలు తీసుకుంటున్నవాళ్లు. పార్టీకోసం ఏం చేయగలుగుతామో? అనే అడుగులు వేయాలి. నేను చేయాల్సింది.. నేను చేశాను. ఇవ్వాల్సింది ఇచ్చాను. కానీ, పార్టీ పరంగా మీ బాధ్యతను నిర్వర్తించాలని, మీ తరఫు నుంచి కోరుతున్నాను. పదవులు పొందుతున్న వారందరికీ కూడా మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవులు ఆశించిన వారు ఇంకా చాలా మంది ఉన్నారు. ఉన్న పదవులు తక్కువ కాబట్టి.. అందర్నీ సంతృప్తి పరచలేం. ఆశావహులందరికీ చెప్పే రీతిలో చెప్పుకుంటూ, వారి కన్విన్స్ చేసుకుంటూ పోవాలి అని ఆయన తెలిపారు.ఇంత పారదర్శకంగా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు లంచాలకు తావులేకుండా పథకాలు అందిస్తున్నాం. విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో మంచి మార్పులు తెచ్చాం. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. ఈరోజు మనం చేసింది ఒక ఎత్తు. పదవులు తీసుకున్న వారు యాక్టివ్‌గా ఉండాలి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 లాంటి వారు ఒక్కటైన సందర్భంలో మనం కూడా అదే స్థాయిలో మన వాణిని వినిపించాలి అని అభ్యర్థులకు సీఎం జగన్ సూచించారాయన.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనే పార్టీని స్థాపించాం..

అధికారంలోకి వచ్చాం. దేవుడి దయవల్ల మంచి పరిపాలన కొనసాగుతోంది. వచ్చే ఎన్నికల్లో 175కి 175 , వై నాట్ అనే రీతిలో పరిపాలన కొనసాగుతోంది. గత ఎన్నికల్లో మెజార్టీ కంటే.. అత్యధిక మెజార్టీ సాధిస్తాం. మరింత మందికి మేలు చేస్తాం. ఈసారి మనం వడ్డీలకు, వడ్డెరలకు అనే కులాలకు ఇచ్చాం. మిగిలిన కులాలకు తదుపరి దఫాలో తప్పకుండా ఇస్తాం అని సీఎం జగన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

## వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థులు వీళ్లే..
## 18 పేర్లు ప్రకటించిన సజ్జల

అమరావతి: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థులను వైకాపా ప్రకటించింది. స్థానిక సంస్థల కోటా నుంచి 9 స్థానాలు, ఎమ్మెల్యే కోటా నుంచి 7, గవర్నర్ కోటా 2 స్థానాలకు పేర్లను వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు.సామాజిక సమీకరణాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని వైకాపా అధినేత, సీఎం జగన్ ఈ పేర్లను ఖరారు చేశారని సజ్జల చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ సాధికారత సాధించాలన్న లక్ష్యంతోనే జగన్ ముందుకు వెళ్తున్నారన్నారు.

అభ్యర్థుల పేర్లు..

స్థానిక సంస్థల కోటా..

1. నర్తు రామారావు (శ్రీకాకుళం)2. కుడిపూడి సూర్యనారాయణ (తూర్పుగోదావరి)3. వంకా రవీంద్రనాథ్ (పశ్చిమగోదావరి)4. కవురు శ్రీనివాస్ (పశ్చిమగోదావరి)5. మేరుగు మురళీధర్ (శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు)6. సిపాయి సుబ్రహ్మణ్యం (చిత్తూరు)7. పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి (కడప)8. ఎ.మధుసూదన్ (కర్నూలు)9. ఎస్.మంగమ్మ (అనంతపురం) ఎమ్మెల్యేల కోటా..1. పెన్మత్స సూర్యనారాయణరాజు (విజయనగరం)2. పోతుల సునీత (బాపట్ల)3. కోలా గురువులు (విశాఖపట్నం)4. బొమ్మి ఇజ్రాయల్ (బీఆర్ అంబేడ్కర్ కోనసీమ)5. జయమంగళ వెంకటరమణ (ఏలూరు)6. చంద్రగిరి ఏసురత్నం (గుంటూరు) 7. మర్రి రాజశేఖర్ (పల్నాడు)గవర్నర్ కోటా..1. కుంభా రవిబాబు (అల్లూరి సీతారామరాజు)2. కర్రి పద్మశ్రీ (కాకినాడ)



## 23న టీడీపీలోకి కన్నా...

గుంటూరు, ఫిబ్రవరి 20,కన్నా లక్ష్మినారాయణ తాను ఏ పార్టీలో చేరబోతున్నాన్న విషయంపై క్లారిటీ ఇచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై తన అనుచరులతో సమావేశమై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీలో చేరడమే మంచిదని ఆ సమావేశంలో అత్యధికులు చెప్పడంతో కన్నా తాను తెలుగుదేశం పార్టీలోకి చేరనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 23న చంద్రబాబు సమక్షంలో కన్నా టీడీపీ కండువా కప్పుకుంటారని ఆయన అనుచరులు తెలిపారు. కన్నాను తమ పార్టీలో చేర్చుకునేందుకు జనసేనతో పాటు బీఆర్ఎస్ కూడా ప్రయత్నాలు చేసింది. వైసీపీ నుంచి కూడా కన్నా కోసం ప్రయత్నాలు జరిగాయని చెబుతున్నారు. ఇక కన్నా లక్ష్మినారాయణకు టీడీపీలో చేరేందుకే నిర్ణయించుకోవడంతో తెలుగుదేశం పార్టీకి చేరికతో టీడీపీకి అదనపు బలం చేకూరినట్లేనని పరిశీలకులు అంటున్నారు. ఇక బీజేపీలో కన్నాకు పొమ్మన లేకపోగపెట్టిన చందంగా వ్యవహరించిన సోము వీర్రాజు చేజేతులా పార్టీకి ఇంతో అంతో ఉన్న బలాన్ని కూడా దూరం చేసినట్లైందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నిజానికి ఒక్క కన్నా లక్ష్మీనారాయణ అనే కాదు.. రాష్ట్ర విభజన తరువాత అటు కాంగ్రెస్ లో ఇమడ లేక, ఇటు తెలుగుదేశంలోనో, మరో పార్టీలోనో చేరలేక బీజేపీలో చేరిన పలువురు మాజీ కాంగ్రెస్ నాయకులు బీజేపీలో ఉక్కపోతకు గురౌతూనే ఉన్నారు.కన్నా లక్ష్మీనారాయణ బీజేపీకి గుడ్ బై చేప్పేశారు. ఆయన బీజేపీ నుంచి బయటకు వచ్చేస్తారని చాలా కాలంగా,



అంటే ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలగిన నాటి నుంచీ ప్రచారం జరుగుతున్నా.. ఆయన ఏ పార్టీలో చేరతారన్న విషయంలో నిన్న మొన్నటి దాకా క్లారిటీ లేదు. జనసేనలోనా, తెలుగుదేశంలోనా అన్న చర్చ జరిగింది. అయితే తెలుగువన్ మాత్రం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలగిన నాడే ఆయన రూటు తెలుగుదేశం వైపే అని చెప్పింది. ఇప్పుడు అదే నిజమైంది. కన్నా తెలుగుదేశం గూటికి చేరనున్నట్లు ప్రకటించేశారు. అయితే కన్నా బాటలోనే నడిచే నేతలు ఏపీ బీజేపీలో ఇంకా పలువురు ఉన్నారు. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి కూడా త్వరలోనూ బీజేపీ గూటిని వీడే అవకాశం ఉంది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం తీరు పట్ల ఆమె బహిరంగంగానే తన అసమ్మతిని, అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా ఆమెకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆమె కూడా త్వరలో పార్టీ వీడే అవకాశాలున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక పార్టీ నుంచి వైదొలగి, తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ప్రకటించిన కన్నా ప్రధాని మోడీ పట్ల తనకు గౌరవం, నమ్మకం ఉన్నప్పటికీ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తీరు పట్ల తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని ప్రకటించారు. ఒక దశలో కన్నాను బుజ్జగించేందుకు బీజేపీ అధిష్ఠానం ఒక కేంద్ర మంత్రిని రంగంలోకి దింపినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు, అలాగే గత నెల 24న భీమవరంలో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకూ కూడా కన్నా దుమ్మా కొట్టినప్పుడే ఆయేన బీజేపీకి గుడ్ బై చెప్పడం ఖాయమైపోంది. ముఖ్యంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేతులు కలిపిన నేపథ్యంలో కన్నా అయితే టీడీపీలో కాదంటే జనసేనలో చేరడం ఖాయమని కూడా పరిశీలకులు తేల్చేశారు. వాస్తవానికి బీజేపీకి కన్నా గుడ్ బై చెప్పేందుకు గ్రౌండ్ గత ఏడాది డిసెంబర్ లోనే ప్రిపేర్ అయ్యింది. కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కన్నా లక్ష్మినారాయణ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. అటు నాదెండ్ల, ఇటు కన్నా కూడా అప్పట్లో చెప్పినా వారి మాటలను ఎవరూ విశ్వసించలేదు. అప్పట్లోనే జనసేనలో కన్నా లక్ష్మినారాయణ చేరిక అంటూ ప్రచారం జరిగింది.

## విద్యా కానుకపై జగన్ దృష్టి

విజయవాడ, ఫిబ్రవరి 20, ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అందిస్తున్న విద్యా కానుక కిట్లను మరింత నాణ్యతతో అందించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. రూ.1,042.53 కోట్ల వ్యయంతో 40 లక్షల మందికి పైగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. మరింత మన్నికతో కూడిన నాణ్యమైన బ్యాగ్‌లు, బూట్లను అందించనున్నారు. ప్లెయిన్ యూనిఫామ్ కాకుండా.. చెక్స్ ఉండే రంగులతో కూడిన క్లాత్ అందించనున్నారు. పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ముద్రణ పనులు ఇప్పటికే స్టార్ట్ అయ్యాయి. ఈ నెల 24వ తేదీ నుంచి జిల్లా పాయింట్లకు పంపిణీ మొదలవుతుంది. స్కూళ్లు తెరిచే రోజే



వీటిని విద్యార్థులకు అందించనున్నారు.విద్యా కానుక ద్వారా అందించే ప్రతి ఒక్క వస్తువు నాణ్యతను స్వయంగా పరిశీలిస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. స్థానిక మార్కెట్లో సుమారు రూ.650 విలువ చేసే నాణ్యమైన బ్యాగులను సరఫరా చేస్తున్నారు. యూనిఫామ్‌కి సంబంధించి బాలికల టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్ క్లాత్ నుంచి చెక్స్ (గడులు) రూపంలోకి మార్పు చేశారు. బూట్లు మరింత షైనింగ్ ఉండేలా చర్యలు చేపట్టారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్‌కి గతంలో మాదిరిగా నామినేషన్ ప్రాతిపదికన అప్పగించారు. 1 నుంచి 9వ తరగతి వరకు బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ప్రచురిస్తున్నారు. అన్ని మీడియం పాఠశాలలకు బైలింగ్వల్ పుస్తకాలు అందించనున్నారు.జగనన్న విద్యా కానుక ద్వారా అందచేసే కిట్లలో నాణ్యత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అధికారులు ఎప్పటికప్పుడు ప్రతి దశలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు

# సంపాదకీయం

మంగళవారం 21-02-2023


## సౌత్ కమలం కలలు...

బీజేపీకి ఉత్తరాది పార్టీ అనే పేరు ఉంది. దీనికి కారణం దక్షిణాదిన ఆ పార్టీకి పెద్దగా బలం లేకపోవడమే. అతి కష్టం మీద కర్ణాటకలో మాత్రం రెండు, మూడు సార్లు అధికారం దక్కించుకుంది. కానీ ఇప్పుడు అక్కడ కూడా ఆ పార్టీ ఎదురీదుతోందన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో దక్షిణాదిలో బీజేపీ పరిస్తితి ఏమిటన్నదానిపై ఆ పార్టీ నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రం విడిపోయిన తరవాత తెలంగాణలో బీజేపీ బలపడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక్క స్థానానికే పరిమితమైన పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం 4 స్థానాలు దక్కించుకుంది. ఇదే ఊపులో తెలంగాణలో అధికారం సాధిస్తామని చెబుతూ వస్తోంది. రెండు ఉప ఎన్నికలు దక్కించుకున్నా.. అభ్యర్థుల వల్లే గెలుపు సాధ్యమైందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బీజేపీ పుంజుకుంటే మునుగోడు ఉప ఎన్నికలో ఎందుకు గెలవలేదనే చర్చ ఉంది. ఓట్ల శాతం పెరిగిందని కవర్ చేసే ప్రయత్నం చేసినా.. అన్ని నియోజకవర్గాల్లో రాజగోపాల్ రెడ్డి స్థాయిలో ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న అభ్యర్థులు ఎంతమంది ఉన్నారు అంటే చెప్పడం కష్టం. అందుకే ఈ సారి తెలంగాణలో పరిస్థితి ఎలా ఉంటుందన్నది చెప్పడం కష్టమే. కర్ణాటకలో బీజేపీ స్వతహాగా విజయం సాధించలేదు. ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా కుమార స్వామి ప్రభుత్వాన్ని కూలగొట్టి అధికారంలోకి వచ్చారు. అదే బీజేపీకి మైనస్ అవుతోంది. ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ అధికారం చేపడితేనే దక్షిణాదిన ఉన్న ఒక్క రాష్ట్రాన్ని నిలబెట్టుకోవడానికి అవకాశం ఉన్నట్లవుతుంది. లేకపోతే కతష్టమవుతుంది. ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ జోరు మీద ఉంది. బీజేపీ అవినీతి ఆరోపణల్లో చిక్కుకుంది. పట్టు ఉన్న ప్రాంతాల్లో జేడీఎస్ కూడా తమ ప్రయత్నాలు తాము చేస్తోంది. తమిళనాడు రాజకీయాల గురించి చెప్పాల్సిన పని లేదు. అక్కడ అన్నాడీఎంతో బీజేపీ పొత్తులో ఉంది. కానీ అది వర్కవుట్ అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఏపీలో అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ డిపాజిట్ దక్కించుకుంటుందా? అనే స్థాయిలో ఉంది. అక్కడ టీడీపీ, వైసీపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. జనసేనతో పొత్తులో ఉన్నామని బీజేపీ చెబుతున్నా.. పవన్ కళ్యాణ్ సైలెంట్ రాజకీయం వారికి అంతుబట్టడం లేదు. అటు టీడీపీ అధినేత చంద్రబాబుతో పవన్ సమావేశాలు అవుతుండడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికితోడు పార్టీ కీలక నేత కన్నా లక్ష్మీనారాయణ గుడ్ బై చెప్పేశారు. కేరళలో బీజేపీ పరిస్థితి ఏంటో అందరికీ తెలుసు. అక్కడ ఎలాగైనా పట్టు నిలుపుకోవాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం సాగిస్తోంది. కానీ, లెఫ్ట్ పార్టీలు కట్టడి చేస్తూనే ఉన్నాయి. అటు కాంగ్రెస్ కూడా బీజేపీని ఆ రాష్ట్రంలో ఎదగనీయకుండా చేస్తోంది. మొత్తంగా తెలంగాణలో బీజేపీ ఆశలు పెట్టుకున్న రాష్ట్రాల్లో కూడా అనుకున్నంత ముందుకు వెళ్లడం లేదు. ఏపీలో బీజేపీకి కనీసం డిపాజిట్లైనా దక్కుతాయనే నమ్మకం అక్కడి పార్టీ నాయకుల్లో లేదు. అధికార వైసీపీ బలంగా ఉండగా... టీడీపీ, జనసేన కూడా అధికారం కోసం పోటీ పడుతున్నాయి. జనసేన పార్టీతో పొత్తుకోసం టీడీపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా.. బీజేపీ మాత్రం జనసేన తమతోనే కలిసి వస్తుందని చెబుతోంది. ఈ క్రమంలో ఆ మూడు పార్టీలు ఎవరితో ఎవరు పొత్తు పెట్టుకుంటారనే డైలమా ఎన్నికల వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఇక బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా సీట్లు గెలవడం మాత్రం కష్టమే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బీజేపీ జాతీయ నాయకత్వం కూడా ఏపీనిపెద్దగా పట్టించుకోనట్లే కనపడుతున్నది. ఇక తమిళనాడు, కేరళలో బీజేపీ అధికారంలోకి రావడం కష్టమే. అధికార డీఎంకే పార్టీ ఎన్నడూ లేనంత బలంగా ఉన్నది. ఇక జయలలిత మరణం తర్వాత ఏఐడీఎంకే పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. డీఎంకే అక్కడ బలంగా ఉన్నన్ని రోజులు బీజేపీ గెలిచే పరిస్థితి ఉండదు. ఇక కేరళలో బీజేపీ పాగా వేయాలంటే చాలా కష్టపడాలి. మొత్తంగా దక్షిణాదిలో ఉన్న ఐదు రాష్ట్రాలతో పాటు, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అధికారంలోకి రావాలంటే బీజేపీకి ఇప్పుడున్న బలం, బలగం సరిపోదు. కర్నాటక, తెలంగాణలో తప్ప మిగిలిన రాష్ట్రాల్లో పెద్దగా చాన్స్ లేదు. తెలంగాణలో కూడా అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ నెలకొనే అవకాశం ఉండటంతో ఇప్పటికే దక్షిణాదిలో పాగా వేయాలనే బీజేపీకల నెరవేరే సూచనలు, ఆ పార్టీపై ఉత్తరాది ముద్ర పోయేఅవకాశంకనిపించడంలేదు.దక్షిణాదిన అసెంబ్లీ ఎన్నికలు కాకుండా కనీసం లోక్ సభ సీట్లు పెంచుకునే ప్రయత్నాలు కూడా కలసి రావడం కష్టమేనన్న వాదన వినిపిస్తోంది.

# సామాజిక వర్గాల ఆధారంగా ఎమ్మెల్సీ అభ్యర్థులు

విజయవాడ, ఫిబ్రవరి 20, ఆంధ్రప్రదేశ్‌లో ఒకే సారి 16 ఎమ్మెల్సీ స్థానాలకు సీఎం జగన్ అభ్యర్థులను ప్రకటించనున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి ఐదుగుర్ని ప్రకటించారు. మరో ఎనిమిది స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ వచ్చింది. మరో మూడు త్వరలో ఖాళీ కానున్నాయి. వాటన్నింటికీ ఒకే సారి అభ్యర్థుల్ని సీఎం జగన్ ఖరారు చేయబోతున్నారు. విధేయత, సీనియార్టితో పాటు టీడీపీ నుంచి వలస వచ్చిన వాళ్లకీ అవకాశాలు ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. వైఎస్ఆర్‌సీపీలో స్థానిక సంస్థల కోటా నుంచి టిక్కెట్లు ఆశించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, శ్రీకా కుళం జిల్లాలకు సంబంధించి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నా యి. ప్రస్తుతం ఆ స్థానాల్లో ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న వారికి మార్చి 29తో ముగ్గు రికి, మే నెలలో మరో ఐదు మందికి పదవీ కాలం ముగియనుంది. దీంతో ఎన్నికల సంఘం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణ యం తీసుకుంది. దీంతో ప్రస్తుతం ఎన్నికలు జరిగే 8 స్థానిక సంస్థల స్థానాలన్ని అధికార వైసీపీకే దక్కనున్నాయి. టిక్కెట్లు ఆశించే వారంతా తాడేపల్లిలో మకాం వేసి ముమ్మ ర ప్రయత్నాలు చేస్తున్నారు. తే సామా జిక వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యతను కల్పించాలని సీఎం జగన్ యోచిస్తున్నారు. ఆ దిశగానే జాబితాను కసరత్తు చేస్తున్నట్లో తెలుస్తోంది. తుది జాబితా సోమవారం అధికారికంగా ప్రకటించనున్నారు. రాయలసీమలో రెడ్డి సామాజికవర్గానికి ప్రాధాన్యత కల్పించే అవకాశం ఉంది. ఒక స్థానం మైనారిటీకి, మరో స్థానం బీసీలకు ఇవ్వనున్నారు. అనంతపురం జిల్లా నుంచి ఏపీ అగ్రి చైర్మన్ నవీన్ నిశ్చల్, కడప జిల్లా నుంచి మాజీ మంత్రి, సీనియర్ నేత పి. రామసుబ్బారెడ్డి పేరు దాదాపుగా ఖరారైంది.నెల్లూరు జిల్లాకు సంబంధించి ఆర్యవైశ్యులకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. గోదావరి జిల్లాలకు సంబంధించి కాపు, కమ్మ సామాజిక వర్గాలకు ప్రాధాన్యతను ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి కూడా కాపు సామాజిక వర్గానికి సంబంధించి మహిళకు కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది. కృష్ణా జిల్లా నుంచి జయమంగళ వెంకటరమణ పేరును జగన్ ఖరారు చేశారు.మంత్రివర్గంలో కొన్ని ప్రధాన వర్గాలకు స్థానం కల్పించలేకపోయారు. ఆ వర్గాలకు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వనున్నారు. నెల్లూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఇద్దరు ముగ్గురు పేర్లు పరిశీలనలోకి వస్తున్నాయి. అలాగే గుంటూరులో చిలుకలూరిపేట నియోజకవర్గానికి చెందిన మర్రి రాజశేఖర్ కు ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తానని గతంలో ప్రజల ముందే జగన్ హామీ ఇచ్చారు. వాటిని నెరవేర్చుకోవాల్సి వస్తోంది. ఇలాంటివి మరికొన్ని హామీలు పొందిన వారు ఆశగా పదవి కోసం ఎదురు చూస్తున్నారు.సీఎం జగన్ ఇప్పటికే ఎమ్మెల్సీ కసరత్తు పూర్తి చేశారు. అదృష్టవంతులెవరన్నది ఒకటి, రెండు రోజుల్లో వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఇంకా యాక్టివ్ కానీ గంటా



విశాఖపట్టణం, ఫిబ్రవరి 20, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, సీనియర్ నేత గంటా శ్రీనివాసరావు రాజకీయంగా ఇంకా యాక్టివ్ కావడం లేదు. అందరూ రోడ్డెక్కుతున్నా ఆయన మాత్రం ఇంకా రిలాక్సుడ్ రాజకీయాలే చేస్తున్నారు. సొంత పార్టీ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా ఆయన కనిపించరు. కానీ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే స్పందిస్తూ ఉంటారు. అదీకూడా సోషల్ మీడియాలో.తాజాగా ఆనపర్తిలో చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకున్న విధానంపై సోషల్ మీడియాలో స్పందంచారు. ప్రతిపక్ష నాయకుడి పర్యటనను అడ్డుకునే స్థాయికి దిగజారడం అంటే నైతికంగా దిగజారడమే. నియంతృత్వం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ప్రతీసారి రుజువైందని స్పందించారు. నాలుగేళ్లుగా సైలెంట్ గానే ఉన్నారు. మధ్యలో చాలా సార్లు పార్టీలు మారుతారన్న ప్రచారం జరిగింది. కానీ చివరికి ఆయన టీడీపీలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు. లోకేష్ పాదయాత్ర ప్రారంభానికి ముందు హైదరాబాద్‌లో యువనేతతో సమావేశం అయ్యారు. లోకేష్ పాదయాత్ర భారీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. అయితే లోకేష్ పాదయాత్ర ప్రారంభోత్సవానికి ఆయన కుప్పం వెళ్లలేదు. నాలుగేళ్ల కాలంలో అసెంబ్లీకి కూడా ఆయన హాజరవడం లేదు. వాస్తవానికి ఆయన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజీనామా చేశారు. ఆయన రాజీనామా స్పీకర్ వద్ద ఇంకా పెండింగ్‌లో ఉంది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. ఈ కారణంగానే అసెంబ్లీకి వెళ్లడం లేదని భావిస్తున్నారు.ఎన్నికలు దగ్గరకు వస్తూండటంతో.. తన నియోజకవర్గంలో టీడీపీ తరపున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్యాడర్‌ను ఇప్పుడే సమాయత్తం చేసుకుంటున్నారు. ఆయన టీడీపీలోనే ఉంటానని క్లారిటీ ఇవ్వడంపై హైకమాండ్ ఎలా స్పందిస్తుందో ఇంకా స్పష్టత ఇవ్వలేదు. నాలుగేళుగా కేసుల పాలై కష్టపడుతున్న అనేక మంది నేతలు మాత్రం ఇప్పుడు గంటాకు ప్రాధాన్యం ఇస్తే అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉంది. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఎవడండీ గంటా అంటూ స్పందించిన తీరు సంచలనంగా మారింది. ప్రతీ సారి సీటు మార్చుకునే అలవాటు ఉన్న గంటా శ్రీనివాసరావు ఈ సారి ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్నదానిపై స్పష్టత లేదు. కానీ ఆయన మాత్రం అప్పుడప్పుడు టీడీపీకి గిగిలింతలు పెడుతున్నారు. ఆయన మళ్లీ ఎప్పుడు యాక్టివ్ అవుతారో కానీ.. టీడీపీ నేతలు మాత్రం ఆయన గురించి మర్చిపోవడం ప్రారంభించారు.

# మండుతున్న ఎండలు



విశాఖపట్టణం, ఫిబ్రవరి 20, ఉత్తర భారతం నుంచి వస్తున్న పొడి గాలుల ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం లేదని తెలిపారు. ఉత్తర వాయువ్య దిశ నుంచి వస్తున్న పొడిగాలుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అంచనా వేశారు. వచ్చే మూడు రోజులు రాత్రి వేళ ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు పగటిపూట వేడి పెరుగుతుందని అంచనా వేశారు. తెలంగాణలో క్రమంగా చలి తగ్గుతోంది. నేడు మూడు జిల్లాలకు మాత్రమే ఎల్లో అలర్ట్ జారీ అయింది. సాధారణంగా 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనిపిస్తే వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తుంది. 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంటే ఎల్లో అలెర్ట్ జారీ చేస్తుంటారు. రాబోయే ఐదు రోజులకు సంబంధించి తెలంగాణ వాతావరణ విభాగం నమోదు కానున్న ఉష్ణోగ్రతల అంచనాలను వెదర్ బులెటిన్‌లో వివరించింది. నేడు ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండనున్నాయి.ఆకాశం నిర్మలంగా ఉంటుంది. నగరంలో పొగ మంచు ఉదయం సమయంలో ఏర్పడుతుంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 34 డిగ్రీలు, 17 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఆగ్నేయ దిశ నుంచి గాలులు గాలి వేగం గంటకు 4 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది" అని వెదర్ బులెటిన్ లో పేర్కొ?న్నారు. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 33.5 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.1 డిగ్రీలుగా నమోదైంది.ఆంధ్రప్రదేశ్ వాతావరణ విభాగం తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపోస్ఫిరిక్ స్థాయిల్లో ఆగ్నేయ, నైరుతి దిశలలో గాలులు వీస్తున్నాయని వెదర్ బులెటిన్ లో పేర్కొన్నారు.ఈ వాతావరణ పరిస్థితుల వల్ల ఏపీలోని ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాం ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు పొడి వాతావరణమే ఉంటుందని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటనలో తెలిపింది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ లో కూడా పొడి వాతావరణమే ఉండనుంది. రాయలసీమలో వచ్చే మూడు రోజులు పొడి వాతావరణమే ఉండనుంది. రాయలసీమలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సగటు ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకూ తక్కువగా ఒకటి లేదా రెండు చోట్ల నమోదయ్యే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఎండలు బాగా పెరగనున్నాయి. మరో మూడు రోజుల వ్యవధిలో ఉభయ గోదావరి జిల్లాలు, ఖమ్మం, భద్రాద్రి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వేడి 38 డిగ్రీల వరకు ఉండనుంది. ఇందులో విజయవాడ?, ఏలూరు, రాజమండ్రి ఉండటం వలన నగర వాసులు తగినంత నీటిని తాగుతూ జాగ్రత్త పడగలరు. మరోవైపున రాయలసీమ?, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల?, కొనసీమ?, విశాఖ, అనకాపల్లి, కాకినాడ?, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వేడితో పాటు ఉక్కపోత కూడ ఉండనుంది. కానీ రాత్రి, అర్ధరాత్రి, వేకువజామున మాత్రం చల్లగా ఉండనుంది. తెలంగాణ వ్యాప్తంగా చల్లగా, ముఖ్యంగా హైదరాబాదులో 11 నుంచి 15 డిగ్రీల మధ్యన రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు ఉండనున్నాయి" అని ఏపీ వెదర్ మ్యాన్ తెలిపారు.

## యువకుడి మృతదేహం లభ్యం

సంగారెడ్డి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ లో ఓ యువకుడి శవం అనుమానాస్పద స్థితిలో పోలీసులకు లభ్యమైంది. మృతుడిని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతి కె గ్రామానికి చెందిన అక్షయ్ రాథోడ్(24)గా పోలీసులు గుర్తించారు.వీరు గత కొంతకాలంగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఈయన మృతి చెందిన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన విషయాన్ని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలంలో దొరికిన సాక్ష్యాలను సేకరించి, హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్



తిరుపతి, ఫిబ్రవరి 20, ఇండియన్ బుల్లెట్ ట్రైన్ వందే భారత్ రైలు సికింద్రాబాద్-తిరుపతి రూట్ ను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల మధ్య పరుగులు పెడుతున్న వందే భారత్ రైలు ఇప్పుడు మరో మార్గంలో ప్రయాణించేందుకు సిద్ధమైంది. సికింద్రాబాద్ -తిరుపతి వందే భారత్ రైలును బీబీనగర్-నడికుడి మార్గంలో మిర్యాలగూడ మీదుగా నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రైలును వరంగల్-ఖాజీపేట మార్గంలో నడపాలని రైల్వే అధికారులు భావించినప్పటికీ ఆ రూట్ లో దూరం ఎక్కువ అవుతుందనే కారణంతో బీబీనగర్-నడికుడి మార్గంలో నడపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. బీబీనగర్ నుంచి గుంటూరు వరకు ఉన్న రూట్ లో రైల్వే ట్రాక్ ను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మార్గంలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ తిరుపతికి చేరుకుంటుంది. నారాయణాద్రి ఎక్స్ ప్రెస్ 664 కిలోమీటర్ల దూరాన్ని 12.30 గంటల సమయంలో చేరుకుంటుంది. సికింద్రాబాద్ - తిరుపతి మధ్య సాధారణంగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మార్గంలో వందేభారత్ రైలును ప్రవేశపెడితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో వందే భారత్ రైలుకు మరింత ఆదరణ పెరుగుతుందని అంటున్నారు. సికింద్రాబాద్-తిరుపతి మధ్య వందేభారత్ రైలు వచ్చే అవకాశం ఉందని ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా చెప్పారు. రైల్వే బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే వందే భారత్ రైలును పరుగుపెట్టించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్-విశాఖ మధ్య వందే భారత్ ఎక్స్ ప్రెస్ నడుపుతున్నారు. ఈ రైలు అందుబాటులోకి వచ్చాక సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణ సమయం భారీగా తగ్గింది. కేవలం 8.40 గంటల్లోనే ప్రయాణికులు విశాఖ చేరుకుంటున్నారు. త్వరలో సికింద్రాబాద్- తిరుపతి మధ్య వందే భారత్ పట్టాలు ఎక్కనుంది. సికింద్రాబాద్-తిరుపతి మధ్య మొత్తం 3 ఆప్షన్స్ ను అధికారులు పరిశీలించారు. ఒకటి బీబీనగర్, నడికుడి, మిర్యాలగూడ మీదుగా, మరొకటి వరంగల్, ఖాజీపేట, కడప మీదుగా, ఇంకొకటి బీబీనగర్ నుంచి గుంటూరు, నెల్లూరు, గూడూరు మార్గాలను అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. పిడుగురాళ్ల నుంచి శావల్యపురం మీదుగా ఒంగోల్, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మార్గం కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. వీటన్నిటిలో బీబీనగర్-నడికుడి రూట్ బెటర్ అని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గంటకు 130 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణించేలా ట్రాక్ ను అభివృద్ధి చేసిన అనంతరం అధికారిక ప్రకటన రానుంది. వందే భారత్ రైలు టికెట్ ధర రూ.1150 నుంచి మొదలవుతుంది. సికింద్రాబాద్- తిరుపతి మధ్య నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తుంది. ఈ రైలు ప్రయాణ సమయం 12 గంటలు పడుతోంది. వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే 6 నుంచి 7 గంటల సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలాఖరులోపు వందే భారత్ రైలు అందుబాటులోకి రానుందని రైల్వే అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీసిటీ మరో ఘనతను సొంతం చేసుకుంది. దేశంలో బాగా ప్రాచుర్యం పొందిన వందే భారత్ సెమీ హైస్పీడ్ రైలు విడి భాగాలను శ్రీసిటీలోని బీఎఫ్జీ అనే సంస్థ తయారు చేస్తోంది. బీఎఫ్జీ సంస్థ 2009వ సంవత్సరం నుంచి నిర్మాణ, రవాణా, పవన విద్యుత్ వంటి రంగాల్లోని పరిశ్రమలకు విడిభాగాలను అందిస్తోంది. మెట్రో కోచ్ ల తయారీ సంస్థలు అయిన బొంబార్డియర్, వోల్వో, అల్ స్తోమ్ తో పాటు ఇండియన్ రైల్వేస్, జనరల్ ఎలక్ట్రికల్ ఎనర్జీ, కొచ్చిన్ షిప్ యార్డు, గమేశ, థెర్మాక్స్, ఎంసీఎఫ్, బెచ్ టెల్ వంటి వివిధ సంస్థలు దీని సేవలను అందుకుంటున్నాయి. సెమీ హైస్పీడ్ వందే భారత్ రైలులోని ఇంటీరియర్, టాయిలెట్ క్యాబిన్, ఇంజిన్ ముందు భాగాన్ని బీఎఫ్జీ సంస్థ తయారు చేసి అందిస్తోంది. ఒక్కో వందే భారత్ రైలు కోసం 329 రకాల ఫైబర్ రీ ఇన్ ఫోర్స్డ్ ప్లాస్టిక్ ప్యానెళ్లను తయారు చేసి ఇస్తోంది. ఆర్డరు ఇచ్చినప్పటి నుండి కేవలం 10 నెలల్లో బీఎఫ్జీ పూర్తి చేసింది. ప్రాజెక్టును ఆకర్షణీయంగా రూపొందించడానికి వివిధ రంగుల ప్యానెళ్లను ఈ కంపెనీ తయారు చేసింది.

# వర్శిటీలో మృత్యుంజయ హోమం... మండిపడుతున్న హేతువాదులు

అనంతపురం, ఫిబ్రవరి 20, అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ ఉపకులపతి నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. విశ్వవిద్యాలయ అభివృద్ధికి, చదువుల నాణ్యత పెంచడానికి, విద్యార్థులకు ఇబ్బంది లేని చదువు అందించడానికి, ఇతర సమస్యలపై దృష్టి పెట్టిన తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటే అందరూ మెచ్చుకునేవారు. కానీ వీసీ అయి ఉండి ఓ వింత నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.ఎస్కే యూనివర్సిటీలో ధన్వంతరి మహా మృత్యుంజయ హోమం చేయాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి నిర్ణయం తీసుకున్నారు. అంతే కాకుండా హోమం చేయడానికి అయ్యే ఖర్చును చందాల రూపంలో ఇవ్వాలని ఉద్యోగులకు రిజిస్ట్రార్ లక్ష్మయ్యతో ఏకంగా సర్క్యులర్ జారీ చేయించారు. టీచింగ్ స్టాఫ్ ఒక్కొక్కరు 500 రూపాయలు, నాన్ టీచింగ్ స్టాఫ్ ఒక్కొక్కరు 100 రూపాయలు ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీలైతే అంతకంటే ఎక్కువే ఇవ్వొచ్చని సర్క్యులర్ లో కోరారు. యూనివర్సిటీ స్టాఫ్ నుంచి చందాలు వసూలు చేసేందుకు ఏకంగా ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ నే నియమించడం గమనార్హం.ఎస్కే యూనివర్సిటీ వీసీ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు చాలా మందిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. శ్రీకృష్ణ దేవరాయల విశ్వవిద్యాలయంలో ఇటీవలి కాలంలో వరుస మరణాలు సంభవించాయి. కొంత కాలంలో వివిధ కారణాల వల్ల దాదాపు 25 మంది యూనివర్సిటీ సిబ్బంది మృతి చెందారు. దీంతో ఈ విషయంలో వీసీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. విశ్వవిద్యాలయ ఉద్యోగులు వివిధ కారణాల చనిపోతుండటం వల్ల వర్సిటీలో ధన్వంతరి మహా మృత్యుంజయ హోమం చేయాలని ఉపకులపతి నిర్ణయం తీసుకున్నారు. మృత్యుంజయ హోమంతో పాటు శాంతి హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేయడం, ఉద్యోగుల నుండి చందాలు వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.మృత్యుంజయ హోమం చేయాలని వీసీ తీసుకున్న నిర్ణయాన్ని, అందుకోసం చందాలు అడగడాన్ని విద్యార్థి సంఘాలు తప్పుపడుతున్నాయి. ఇలాంటి హోమం లాంటి కార్యక్రమాల వల్ల వర్సిటీలో కులాలు, మతాల మధ్య వైషమ్యాలు పొడచూపే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయంలో మత కార్యక్రమం నిర్వహించడం సబబు కాదని, ఈ నిర్ణయాన్ని ఉపకులపతి, రిజిస్ట్రార్ వెనక్కి తగ్గాలని అన్నారు. వర్సిటీలో కులాలు, మతాలుగా విడదీసే విధంగా హోమాలు చేయడం ఏమాత్రం కరెక్టు కాదని చెప్పారు. హోమాలు, యాగాలు, శాంతి పూజలు చేయడానికి బదులు వర్సిటీ అభివృద్ధిపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ఎస్కే యూనివర్సిటీలో తలపెట్టి దల్చిన మహా మృత్యుంజయ హోమం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని.. లేదంటే మత కార్యాన్ని అడ్డుకుంటామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.ఈ అంశంపై రిజిస్ట్రార్ లక్ష్మయ్య మాట్లాడారు. ఇటీవల వర్సిటీలో చాలా మంది బోధన, బోధనేతర సిబ్బంది అకాల మరణం చెందిన నేపథ్యంలో మృత్యుంజయ హోమం నిర్వాహించాలని అనుకున్నట్లు తెలిపారు.

## రంపచోడవరంలో టీడీపీ దారెటు

ఏలూరు, ఫిబ్రవరి 20,అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం నా రిజర్వ్డ్ నియోజకవర్గం. ఇక్కడ టీడీపీ ఇంఛార్జ్ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి. ఆమె ఒంటెద్దు పోకడలకు పోతున్నారనేది కేడర్ ఆరోపణ. మూడున్నరేళ్లుగా శ్రేణులు చెల్లాచెదురవుతున్నా పట్టించుకోవడం లేదట. వంతలతో పడని మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వర్లు, చిన్నం బాబు రమేష్‌లు టీడీపీకి దూరంగా ఉంటున్నారు. ఒకప్పుడు రంపచోడవరం టీడీపీకి కంచుకోట. టీడీపీ పోటీలో లేకపోతే సైకిల్ పార్టీ మద్దతుతో ఇక్కడ వామపక్షాలు బరిలో ఉండేవి. 2004 నుంచి సీన్ మారింది. 2004, 2009లో ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. తర్వాత వైసీపీకి పట్టం కట్టారు రంపచోడవరం ఓటర్లు.2014లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రాజేశ్వరి తర్వాత కండువా మార్చేశారు. 2019 ఎన్నికల్లో సీనియర్లను కాదని రాజేశ్వరికే టికెట్ ఇచ్చింది టీడీపీ అధిష్ఠానం. దాంతో మాజీ ఎమ్మెల్యేలు అలిగినట్టు చెబుతారు. దీనికితోడు వైసీపీ నుంచి వచ్చిన వాళ్లకే టీడీపీలో ప్రాధాన్యం ఇస్తున్నారని రాజేశ్వరిపై ఆరోపణలు ఉన్నాయి. అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు ఊసే లేదట. ఏదైనా చేస్తే మొక్కుబడిగా ఉంటోందనేది తెలుగు తమ్ముళ్ల ఆవేదన. ఇదే సమయంలో వచ్చే ఎన్నికల కోసం కొందరు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారుమరోసారి పోటీకి రాజేశ్వరి ఆసక్తితో ఉండగా.. టీడీపీ నేత గొర్లె సునీత సైతం కర్చీఫ్ వేస్తున్నారట. మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ.. మాజీ మంత్రులతో టికెట్ కోసం మంతనాలు జరుపుతున్నారట. టిడిపి టికెట్ ఎవరికి కేటాయిస్తారనేది క్వశ్చన్ మార్క్ కావడంతో నేతలు సైలెంట్ అయ్యారు. ఒకరంటే ఒకరికి గిట్టక కార్యకర్తలు సైతం గ్రూపులుగా విడిపోయారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న నేతలే కాకుండా.. శీతంశెట్టి వెంకటేశ్వర్లు, చిన్నం బాబు రమేష్ కూడా టీడీపీ ఛాన్స్ ఇస్తే పోటీకి సై అంటున్నారట. అయితే అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇస్తే వారే పార్టీ జెండా మోస్తారని.. మిగిలిన వాళ్లు దూరంగా ఉంటారని ప్రచారం మొదలైంది. గడిచిన 4 ఎన్నికల్లో ఓడినా.. ఇక్కడి నేతలు గుణపాఠం నేర్చుకోలేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి.. రంపచోడవరం టీడీపీకి పార్టీ పెద్దలు చికిత్స చేస్తారో లేక నాన్చుతారో చూడాలి.

## నిధులు లేని పవర్ ఫైనాన్స్

గుంటూరు, ఫిబ్రవరి 20, తీసుకున్న డిపాజిట్లను తిరిగి చెల్లిరచడంలో ఎపి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ విఫలమవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అలాగే తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు ఇచ్చినందుకు, ఆ నిధులు సజావుగా తిరిగి రాక ఇరధనశాఖ అల్లాడిపోతోరది. చివరకు వడ్డీ కూడా రాకపోవడంతో జెన్‌కో అధికారులు ఆరదోళన వ్యక్తం చేస్తున్నారు. వారంలో తిరిగిస్తామంటూ తీసుకున్న రూ.వంద కోట్లు, జెన్‌కో గ్రాట్యుటీ ట్రస్ట్ నురచి తీసుకున్న రూ.723 కోట్లు మొత్తం ఇరకా రావడం లేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే పలు దఫాలుగా లేఖలు రాసినట్లు ఒక సీనియర్ అధికారి చెప్పారు. గతేడాది నవంబరులో ఎపి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు జెన్‌కో రూ.వంద కోట్లను డిపాజిట్‌గా ఇచ్చిరది. ఈ నిధులను పిడి ఖాతాలోకి కూడా జమ చేశారు. ఈ మొత్తాన్ని వారం రోజుల్లో ఇస్తామని పిఎఫ్‌సి మురదుగా స్పష్టం చేసిరది. అయితే ఇప్పటివరకు ఆ నిధులు ఇవ్వలేదని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ నిధులు వస్తే ఎన్‌టిటిపిసి స్టేజ్-5 పనులకు ఖర్చు చేయాల్సి ఉరటురదని వారంటున్నారు. ఈ మొత్తంపై ఇప్పటివరకు దాదాపు రూ.2 కోట్లు వడ్డీ కూడా రావాల్సి ఉరదని చెబుతున్నారు. వడ్డీల భారం పెరిగినా కూడా తారిఫ్‌లో మార్పులు చేసేరదుకు విద్యుత్ నియంత్రణ మండలి అరగీకరిరచడం లేదని జెన్‌కో అధికారులు వాపోతున్నారు.రాష్ట్ర విభజన జరగడానికి మురదు 2012లోనే రూ.1,787 కోట్ల బారడ్లను 9.57 శాతం వడ్డీతో ఎపిపిఎఫ్‌సి విడుదల చేసిరది. ఈ నిధులు పింఛను, గ్రాట్యుటీ ట్రస్టుకు సంబంధిరచినవి. విభజన అనంతరం ఈ మొత్తంలో రూ.723 కోట్లు రాష్ట్ర వాటాగా మిగిలిపోయాయి. దీనిపై వడ్డీని ఖచ్చితంగా పిఎఫ్‌సి చెల్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే గతేడాది సెప్టెరబరు నురచి వడ్డీగా రావాల్సిన రూ.52 కోట్లు ఇరకా రాలేదని, తెలంగాణ వాటాగా ఉన్న రూ.1,064 కోట్లలో కూడా బకాయిలు ఉన్నాయని అధికారులు అరటున్నారు. ఈ బకాయిల వల్ల సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెల్లిరచాల్సిన గ్రాట్యుటీ, ఇతర ఉద్యోగ విరమణ అనంతర ప్రయోజనాల చెల్లిరపులకు ఇబ్బరదులు కలుగుతున్నట్లు జెన్‌కో అధికారులు చెబుతున్నారు.

## మీకోసం' ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ

కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో' మీకోసం' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ సువర్ణ రాజు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన దినసరి వేతనాన్ని సంపాదించే యువకులు సమాజానికి సేవ చేయాలి అనే లక్ష్యంతో' మీకోసం' స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి నిస్సహాయులకు చేయూత నివ్వడం అభినందినీయమన్నారు. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ దినసరి వేతనంలో కొంత శాతాన్ని సమాజ సేవకు వె చ్చిస్తున్న యువత సేవా తత్పరత అభినందనీయమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు పిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న రోగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి నిత్యవసర సరుకులు అందజేస్తున్నారని తెలిపారు. అదే విధంగా క్షతగాత్రులకు అవసరమైన సమయంలో రక్తదానం కూడా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రాఘవరావు, రేలంగి బాపిరాజు ,శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆచరణలోకి రాని సెనగ మద్దతు ధర

అనంతపురం, ఫిబ్రవరి 20, కనీస మద్దతు ధర కోసం పప్పుశనగ రైతులు ఎదురు చూస్తున్నారు. రబీలో సాగైన పంట నూర్పిడులు జరుగుతున్నా సేకరణ మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు అడిగిన ధరకే పంటను అమ్ముతున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో పప్పుశనగ పంట పెద్దఎత్తున సాగవుతుంది. రబీలో 1.60 లక్షల ఎకరాలు సాగు చేశారు. అనంతపురం జిల్లా పరిధిలోనే 1.56 లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగైంది. ఈ పంట ఇప్పుడు చేతికొచ్చి నూర్పిడిలు జరుగుతున్నాయి. ప్రతి పంటనూ కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్ల నమోదు ప్రక్రియ మాత్రమే మొదలైంది. ఎప్పటి నుంచి సేకరణ ప్రారంభమవుతుందో తెలియక రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.పప్పుశనగ పంటకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాకుకు రూ.5330 ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నది క్వింటా రూ.4500 వరకు మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర కంటే రూ.830 తక్కువ ధరకు రైతులు అమ్ముకోవాల్సిన వస్తోంది. పంట విత్తుకునే సమయంలో ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చిన ధరనే క్వింటా రూ.5200 ఉంది. సబ్సిడీ కాకుండా క్వింటా రూ.6100గా నిర్ణయించి రైతులకు ఇచ్చింది. ఇప్పుడు చూస్తే క్వింటా ధర రూ.4500 మాత్రమే ఉండటంతో ప్రభుత్వం తక్షణం మద్దతు ధరకు పప్పుశనగ కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసినా ఒక్కో రైతు నుంచి 25 క్వింటాళ్ల వరకు మాత్రమే పరిమితి ఉంది. ఆపైన పండిన పంటను రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదు. దీంతో మూడు ఎకరాలపైనున్న రైతులు తక్కిన పంటను బయట అమ్ముకోవాల్సి వస్తోంది. ఎందుకంటే ఎకరానికి ఎనిమిది నుంచి తొమ్మిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అంటే మూడు ఎకరాల రైతుకు పూరి స్థాయిలో పంట తొమ్మిది క్వింటాళ్లు వస్తే మూడు ఎకరాలకే 27 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ఆపైన భూమి కలిగిన రైతులు బహిరంగ మార్కెట్లపైనే ఆధారపడాల్సి వస్తుంది. తొమ్మిది ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశాను. ఎకరానికి రూ.15 వేల వరకు ఖర్చు వచ్చింది. తొమ్మిది ఎకరాలకు కలిపి మొత్తం రూ.1.35 లక్షలు పెట్టుబడి వచ్చింది. వర్షాలతో దిగుబడి కొంత తగ్గినా మొత్తం 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఇప్పుడు ఈ పంటను కొనేవారు లేరు. ప్రభుత్వం కొనుగోలు ఇంకా ప్రారంభించలేదు. కేవలం పేర్లు నమోదు మాత్రమే చేసుకుంటున్నారు. వారు ఎప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారో తెలియదు. బయట చూస్తే క్వింటా రూ.4500 వరకు మాత్రమే ధర ఉంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదనిరైతులు వాపోతున్నారు



# ఏపీ బీజేపీలో అయోమయం

విజయవాడ, ఫిబ్రవరి 20, ఏపీ బీజేపీలో ఏం జరుగుతోంది. నిన్న మొన్నటి వరకు ఇదో అధికారంలోకి వచ్చేస్తున్నామన్న పార్టీలో విభేదాలు పెద్ద సమస్యగా మారుతోంది. కీలకమైన నేతలు పార్టీ వీడుతున్నా... ముఖ్యమైన నేతలపై ఆరోపణలు వినిపిస్తున్నా రాష్ట్రాధ్యక్షుడు స్పందించడం లేదు. ఇంతకీ పార్టీలో ఏం జరుగుతోందని కేడర్ అయోమయంలో ఉంది. తాను పార్టీ మారడానికి ఆ ఇద్దరే కారణం అన్నారు కన్నా లక్ష్మీ నారాయణ. ఆ ఇద్దరు ఏంటీ.. ఆ మహానుభావులు అని చెప్పు అంటూ జీవీఎల్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు పురంధేశ్వరి. ఇలా ఏపీ బీజేపీలో ఎప్పటి నుంచో గూడు కట్టుకున్న అసంతృప్తి మెల్లిమెల్లిగా బయటపడుతోంది. ఈ సంతృప్తికి కారణం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహా రావే అంటూ చాలా మంది నేతలు వారిద్దరివైపు వేళ్లు చూపిస్తున్నారు. రెండు రోజుల క్రితం బీజేపీకి రాజీనామా చేసిన కన్నా లక్ష్మీనారాయణ.. ఢిల్లీ నాయకత్వాన్ని పొడుగుతూనే... రాష్ట్ర నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఒంటెద్దు పోకడల కారణంగానే తాను పార్టీని వీడుతున్నట్టు చెప్పుకొచ్చారు. పార్టీకి కొన్నేళ్ల పాటు రాష్ట్రపార్టీకి అధ్యక్షుడిగా పని చేసిన వ్యక్తి, సీనియర్ నేత పార్టీ మారినప్పుడు కానీ, ఆయన చేసిన విమర్శలపై కానీ ఇంత వరకు ఎవరూ స్పందించకపోవడం చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయన మాటలను ఖండించడం కానీ.. ఆయన చేసింది తప్పని చెప్పడం కానీ చేయలేదు. కన్నా లక్ష్మీనారాయణ పార్టీ వీడిన తర్వాత రోజే మరో సీనియర్ నేత పురంధేశ్వరి జీవీఎల్‌పై వాగ్బాణాలు సంధించారు. ఆ ఇద్దరూ అంటూ వైఎస్, ఎన్టీఆర్‌ప విమర్శలు చేయాడాన్ని తప్పు పట్టారు. ఆ ఇద్దురూ అని కాదు ఆ మహానుభావులు అనాలంటూ సూచించారు. దీనిపై కూడా సోము వీర్రాజు నుంచి కానీ జీవీఎల్ నుంచి కానీ రియాక్షన్ రాలేదు. వీళ్లపై ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు.... మిత్రుడిగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర నాయకత్వంపై చాలా అసంతృప్తిగానే ఉన్నారు. ఢిల్లీ నాయకత్వం కారణంగానే ఇప్పటి వరకు పవన్ బీజేపీతో కలిసి ఉన్నారు. రోడ్ మ్యాప్ విషయంలో ఏపీ బీజేపీ నాయకత్వంపై సెటైర్లు వేశారు. ఈ మధ్య కాలంలో కూడా పొత్తుల విషయంలో జాతీయ నాయకత్వం చూసుకుంటుందని ఇక్కడి వారికి అవగాహన లేదన్నట్టు మాట్లాడారు. అప్పట్లో రాజధాని అంశంలో కూడా గందరగోళం నడిచింది. ఓ వర్గం అమరావతికి అనుకూలంగా మాట్లాడితే జీవీఎల్ లాంటి వాళ్లు తేడాగా మాట్లాడేవాళ్లు. దీంతో ప్రతిపక్షాలు కూడా సోమువీర్రాజు, జీవీఎల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలక్రమంలో ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశాలతో అమరావతికి అనుకూలంగా మాట్లాడాలని నిర్ణయించారు. ఈ మధ్య కాలంలో జీవో నెంబర్ 1పై కూడా జీవీఎల్, సోమువీర్రాజు ఓ స్టాండ్ తీసుకుంటే... పార్టీలోని మిగతా నాయకులంతా వేరే స్టాండ్ తీసుకున్నారు. రాష్ట్రంలోని సమస్యలు, ఇతర అంశాలపై ఏకాభిప్రాయం లేకుండా జీవీఎల్, సోమువీర్రాజు ఓ దారిలో మిగతా నేతలంతా మరోదారిలో ఉన్నారని విమర్శలు వస్తున్నాయి. ఇలా ఏపీ బీజేపీలో జీవీఎల్, సోమువీర్రాజు ఓవర్గంగా మిగతా సీనియర్, జూనియర్ నేతలంతా మరో వర్గంగా విడిపోతున్నారనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. దీని వల్ల బీజేపీ కేడర్ నలిగిపోతుందని చెబుతున్నారు కొందరు నాయకులు. సోమువీర్రాజు కానీ, జీవీఎల్ కానీ తెలుగుదేశాన్నిటార్గెట్ చేసుకున్నంతగా వైసీపీని టార్గెట్ చేయడం లేదని... అధికారంలో ఉన్న పార్టీని టార్గెట్ చేయకుంటే ప్రజలు ఎలా హర్షిస్తారని లోలోపలే మధన పడుతున్నారురాష్ట్ర పార్టీలో ఇన్ని జరుగుతున్నా నాయకత్వం స్పందించి కేడర్ క్లారిటీ ఇవ్వకపోవడంతో నేతల్లో అసహనం పెరిగిపోతోంది. ఒకరు పెట్టి కార్యక్రమాల్లో మరొకరు కనిపించడం లేదు. మొన్నటికి మొన్న పెట్టిన కార్యవర్గ సమావేశానికి చాలా మంది జిల్లా నాయకులు దుమ్మా కొట్టడానికి ఈ విభేదాలు, అసంతృప్తులే కారణమని టాక్ గట్టిగా వినిపిస్తోంది.

# నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం




మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. యునెస్కో 1999 ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినంగా ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21 నుండి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. 1947 లో భారత దేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ రెండు భౌగోళికంగా వేర్వేరు భాగాలు ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్ అని పిలుస్తారు) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుతం పాకిస్తాన్ అని పిలుస్తారు). సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండు ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలను భారతదేశం వేరు చేసింది.తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్ ) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు.1948 లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు.తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్థాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు, మొదలైనవి ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు.1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు. పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21, న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది.

## నెల్లూరులో ర్యాగింగ్... విద్యార్థి సూసైడ్

నెల్లూరు, ఫిబ్రవరి 20, నెల్లూరు జిల్లా కావలి సమీపంలో ఓ విద్యార్థి రైలు కిందపడి చనిపోయిన ఘటనలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదట దీన్ని ఓ ప్రమాదం అనుకున్నారు రైల్వే పోలీసులు. ఉదయం వాకింగ్ కి వచ్చిన విద్యార్థి రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని చనిపోయాడని అనుకున్నారు. ఆ విధంగా దర్యాప్తు ప్రారంభించారు. కానీ తల్లిదండ్రులు అది ఆత్మహత్య అంటున్నారు. ర్యాగింగ్‌కి బలైపోయాడని ఆరోపిస్తున్నారు.నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం శంకరనగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ టి.పెంచలయ్య, లక్ష్మి కుమారి దంపతుల కుమారుడు ప్రదీప్. ప్రదీప్ కావలిలోని ఖీఖీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుపున్నాడు. సెకండ్ ఇయర్ కి వచ్చినా ర్యాగింగ్ భూతం అతడిని వెంటాడింది. ఫస్ట్ ఇయర్ లో ఎలాగోలా నెట్టుకొచ్చినా, సెకండ్ ఇయర్ లో ర్యాగింగ్ భరించలేకపోయేవాడినని తల్లిదండ్రులకు చెబుతుండేవాడు ప్రదీప్.బోగోలు మండలం కడనూతలలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న కాలేజీ ఖీఖీ ఇంజినీరింగ్ కాలేజీ. ఈ కాలేజీ ఇప్పుడు వార్తల్లోకెక్కడంతో రాజకీయంగా కూడా ఇదో సంచలన విషయంగా మారింది. ఎమ్మెల్యేకి చెందిన కాలేజీలో కూడా ర్యాగింగ్ జరుగుతోందని, ఆ ర్యాగింగ్ వల్లే ప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడని అంటున్నారు.అమ్మాయిల ఫోన్ నెంబర్లు కావాలంటూ ప్రదీప్ ని ర్యాగింగ్ చేసేవారట సీనియర్లు. వారి క్లాస్ మేట్స్ అమ్మాయిల ఫోన్ నెంబర్లు కావాలని ప్రదీప్ ని వేధించేవారట. బీర్లు, బిర్యానీ కొనిపెట్టాలంటూ ఒత్తిడి చేసేవారట. ఆటో డ్రైవర్ కొడుకు కావడం, మధ్యతరగతి కుటుంబం కావడంతో డబ్బులు ఇవ్వలేక, వారు పెట్టే టార్చర్ భరించలేక చాలాసార్లు ప్రదీప్ కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పాడని అంటున్నారు. డబ్బులు లేవని చెబితే సెల్ ఫోన్ లాక్కునేవారని చెప్పేవాడట ప్రదీప్.ర్యాగింగ్ విషయం కాలేజీలో ఫిర్యాదు చేస్తామంటే ప్రదీప్ భయపడేవాడని చెబుతున్నారు తల్లిదండ్రులు. అందుకే తాము మొదట్లో వెనకడుగు వేశామని, ఆ తర్వాత ధైర్యంగా కాలేజీల ఫిర్యాదు చేశామని, టీసీ ఇచ్చేయమని అడిగామని, కానీ యాజమాన్యం పట్టించుకోలేదని చెబుతున్నారు ప్రదీప్ పేరెంట్స్. దీంతో వారు కూడా సైలెంట్ గా ఉండిపోయారు. వారం రోజులనుంచి ర్యాగింగ్ మరీ ఎక్కువైందని ఇంట్లో చెప్పేవాడట ప్రదీప్. వారి పేర్లు చెప్పాలని అడిగితే మాత్రం సైలెంట్ గా ఉండేవాడట.హాస్టల్ వదిలి వెళ్లిపోతే చంపేస్తామని కూడా బెదిరించారట. దీంతో హాస్టల్ వదిలి రాలేక, యాజమాన్యానికి వారెవరో చెప్పలేక ప్రదీప్ సతమతం అయిపోయాడట. ఆ తర్వాత శివరాత్రికి సెలవలు రావడంతో ప్రదీప్, కావలి కలుగోళమ్మ పేటలో ఉన్న చిన్నమ్మ ఇంటికి వెళ్లాడని చెబుతున్నారు తల్లిదండ్రులు. అక్కడే ఉండి తిరిగి కాలేజీకి వెళ్తాడని భావించామని, ఇలా ప్రాణాలు తీసుకుంటాడని అనుకోలేదన్నారు. కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని అంటున్నారు పేరెంట్స్.ప్రమాదంగా ఈ కేసు రిజిస్టర్ చేశామని, ఆత్మహత్య అని చెబుతున్నందున దీన్ని బిట్రగుంట స్టేషన్ కు బదిలీ చేస్తామంటున్నారు రైల్వే పోలీసులు. ప్రదీప్ తల్లిదండ్రులు మాత్రం చేతికి ఎదిగొచ్చిన కొడుకు ఇలా ఆత్మహత్య చేసుకుంటాడని అనుకోలేదని భోరున విలపిస్తున్నారు

## తెలుగు రాష్ట్రాల్లో బి ఆర్ ఎస్ బహిరంగ సభలు?

హైదరాబాద్, ఫిబ్రవరి 20, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఆఫ్ కండక్ట్ కారణంగా ఫిబ్రవరి 17న హైదరాబాద్ లో జరగాల్సిన బీఆరెస్ బహిరంగ సభ వాయిదా వేయవలసి వచ్చింది. అయితే పార్టీ ఇతర రాష్ట్రాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం.బీఆర్ ఎస్ ఇప్పటికే తెలంగాణలోని ఖమ్మం, మహారాష్ట్రలోని నాందేడ్‌లో రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించింది. వీటికి ప్రజల నుండి భారీ స్పందన వచ్చింది. రాబోయే మూడు, నాలుగు నెలల్లో ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి భారీ సభలను నిర్వహించాలని బీఆర్ ఎస్ నాయకులు ప్లాన్ చేస్తున్నారు. పార్టీ ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, ఢిల్లీ ల్లో సమావేశాలను ఏర్పాటు చేయబోతోంది హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 17న జరగాల్సి ఉండిన సమావేశానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, జేడీ (యు) జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్, అంబేద్కర్ మనవడు, సామాజిక కార్యకర్త-రాజకీయవేత్త ప్రకాష్ అంబేద్కర్ తదితరులు హాజరవుతారని ప్రకటించారు. అయితే, రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర సచివాలయ ప్రారంభోత్సవంతో పాటు ఈ సభ కూడా వాయిదా పడింది. బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14న రాష్ట్ర సచివాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించగా, అదే రోజు బీఆర్ఎస్ బహిరంగ సభ కూడా జరపాలని ప్లాన్ చేస్తున్నారు. గతంలో వస్తామని హామీ ఇచ్చిన నాయకులనే కాకుండ మరి కొందరు జాతీయ స్థాయి నేతలను కూడా సభకు రప్పించాలని బీఆరెస్ ప్లాన్ చేస్తోంది. ఇక ప్రస్తుతానికి ఇతర రాష్ట్రాల్లో బహిరంగ సభలపై పార్టీ దృష్టి సారించింది. “ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, ఢిల్లీలో బహిరంగ సభలు జరుగనున్నాయి. మేము వాటిపై పని చేస్తున్నాము. ఆ సభలకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తాము. ప్రతి బహిరంగ సభల్లో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నాయకులు బీఆర్ఎస్‌లో చేరి పార్టీ పునాదులను బలోపేతం చేయనున్నారు” అని పార్టీ ప్రధాన కార్యదర్శి ఒకరు ప్రముఖ పత్రికతో చెప్పారు. ఏప్రిల్, మే నెలల్లో ఒడిశా, కర్ణాటకలో మరో రెండు బహిరంగ సభలు, ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో మరో బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ముందుగా ప్రకటించినట్లుగా, మేలో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్ ఎస్ నాయకులు ఏఆ (రా) తరపున ప్రచారం చేయాలని భావిస్తున్నారు. అలాగే కర్ణాటకలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ సక అరంగేట్రం చేయవచ్చు. కర్ణాటక ఎన్నికల సందర్భంగా మాజీ ప్రధాని హెచ్‌డి దేవేగౌడ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి నేతృత్వంలోని జెడి(ఎస్) తరపున తనతో సహా పార్టీ నేతలు ప్రచారం చేస్తారని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. తెలుగు మాట్లాడే నియోజకవర్గాల్లో. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో డజనుకు పైగా స్థానాల్లో పార్టీ పోటీ చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## సామాజిక న్యాయమే న్యాయస్థానాల లక్ష్యం

కాకినాడ సమాజంలో నెలకొన్న సాంఘిక అసమానతలను తొలగించడానికి న్యాయస్థానాలు కృషి చేస్తున్నాయని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. శేషాద్రి నగర్ లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, పూర్తి ఉపాధి, లింగ సమానత్వం, సామాజిక శ్రేయస్సు, అందరికీ న్యాయం చేయడానికి గాను ప్రతి ఏట ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిందన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా ఇంకా ధనిక పేద వర్గాల మధ్య అసమానతలు కొనసాగుతున్నాయని అన్నారు. సమాజంలో ఏర్పడిన సామాజిక అసమానతలను తొలగించి తరతరాలుగా జరిగిన సామాజిక దురన్యాయాన్ని సరిదిద్దాలని అన్నారు.

## ఉపాధ్యాయుల. పట్టభద్రుల సమస్యలపై పోరాడే సాధించే వారిని గెలిపించండి

సీపీఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్



నంద్యాల :- పశ్చిమ రాయలసీమ ప్రాంతములో ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి నెల 13వ తేదీ జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని అందుకే ఉపాధ్యాయులు అభ్యర్థి. కత్తి నరసింహారెడ్డి గారికి.పట్టభద్రులు అభ్యర్థి పోతుల నాగరాజు గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆలోచించి ఉపాధ్యాయ సంఘం నాయకులను ఉద్యమకారులను ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా ఫకృద్దీన్. సిపిఐ. మండల కార్యదర్శి. ఏ. సుబ్బారాయుడు. ఇన్సాఫ్. నాయకులు. మధు బాషా. పిలుపుచ్చారు. సోమవారం నాడు నంద్యాల మండలంలోని.కానాల హైస్కూల్ కొట్టాల. పాండురంగాపురం చాపిరేవుల. క్రాంతి నగర్ గ్రామాలలోని జిల్లా పరిషత్ స్కూలు.ఎలిమెంటరీ స్కూల్లు . మోడల్ స్కూల్లలో ఉపాధ్యాయులను కలిసి అభ్యర్థిస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు .

## స్వామి అమ్మవార్ల సేవలో గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్

స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్

శ్రీశైలం సోమవారం రోజు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరి చందన్ దంపతులు ఆలయం వద్దకు ఉదయం చేరుకున్నారు. గంగాధర మండపం వద్ద రాష్ట్ర గవర్నర్ కి, వారి ధర్మపత్ని సుప్రభ హరిచందన్, వారి కుమారుడు ప్రశంజిత్ హరిచందన్, వారి కోడలు సరోజిని హరిచందన్ లకు ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం ఈఓ లవన్న, అర్చకస్వాములు, వేద పండితులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం రత్నగర్భగణపతిస్వామి వారిని దర్శించుకుని హారతిని స్వీకరించారు. తదుపరిశ్రీ మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి మల్లికా గుండంలో (సరస్వతీ నదీ అంతర్వాహిని) ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని దర్శించుకున్నారు.తదుపరి శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరి చందన్ కుటుంబానికి అర్చక స్వాములు, వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత శేషవస్త్రాలను, లడ్డుప్రసాదాలను మరియు శ్రీస్వామిఅమ్మవార్ల జ్ఞాపికను ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం ఈఓ లవన్నలు అందచేశారు.

# కేసి కెనాల్, ఎల్ ఎల్ సి, హెచ్ ఎల్ సి, ఆర్ డి ఎస్ ను కాపాడండి

---ఈ నెల 28 న చలో ఆదోనిని విజయవంతం చేయండి

నంద్యాల :-కర్ణాటక రాష్టంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకోవాలని, రాయలసీమ ఎడారిగా మారకుండా కాపాడాలని, తుంగభద్రనది నుండి రాయలసీమకు హక్కుగా రావాల్చిన నికరజలాలు సక్రమంగా అందేలా చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి, గోపాల్ యాదవ్, గాలి రవిరాజ్, శ్రీలక్ష్మి లు డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల శంకరాస్ డిగ్రీ కళాశాలలో నందకుమార్ యాదవ్ అధ్యక్షతన రాయలసీమ స్టీరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నికర జలాలు కేటాయించిన రాయలసీమ



ప్రాజెక్టులకు అర కొర నిధులు కేటాయిస్తూ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయకుండా దశాబ్దాలుగా ప్రభుత్వం, పాలకులు మోసం చేస్తున్నారు, ప్రాజెక్టుల నుంచి కూడా పూర్తిగా నికర జలాలు వాడుకోలేని దుస్థితి నెలకొల్పాదని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర నదిలో నీళ్లు ఉన్న విషయం ప్రభుత్వ లెక్కలే తెలియజేస్తున్నాయి. ఏడాదికి సగటున 143 టీయమ్ సీ ల తుంగభద్ర నీరు సుంకేసుల ఆనకట్టదాటి కృష్ణానదిలో కలిసి శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ దాటి సుమారు 500 టి యమ్ సీ లకు పైగా కృష్ణానది నీరు రాయలసీమకు దక్కకుండా నిరూపయోగంగా సముద్రంలో కలుస్తున్నా పాలకుల్లో చలనం కూడా లేదన్నారు. రాయలసీమ సమాజమంతా పార్టీలకతీతంగా ఒక్కటై రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వాన ఈ ఫిబ్రవరి 25 వ తేదీ ఖీఆూ నుండి ఆదోని వరకు జరిగే రాయలసీమ రైతు ప్రజాపాద యాత్ర, ఫిబ్రవరి 28 వ తేదీన ఆదోని లో జరిగే ×రాయలసీమ ప్రజా ప్రదర్శన విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు శివ ప్రసాద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆర్. నరసింహ యాదవ్, అంబటి బాలస్వామి రెడ్డి, శ్రీనివాసులు, జి. నాగన్న, జి. మహేశ్వరరెడ్డి, పి. వేణుగోపాలయ్య, శివ దస్తగిరి, సూర్య నారాయణ రెడ్డి తదితరులు పాల్గొని చలో ఆదోని ప్రచార కరపత్రాలు విడుదల చేసి పంపిణి చేశారు

## బద్వేలు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే రేసులో సమ్మెట అబ్రహాం

అబ్రహాం కుటుంబం మొదటినుంచి తెలుగుదేశం పార్టీలోనేపట్టు పెంచుకుంటున్న అబ్రహాం

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి ఆశీస్సుల కోసం అబ్రహాం ప్రయత్నాలు

బద్వేలు ,బద్వేల్ అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే రేసులో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సమ్మెట అబ్రహం ఉన్నట్లు సమాచారం ఈ మేరకు బద్వేల్ అసెంబ్లీలోని ఏడు మండలాల్లో ప్రచారం జరుగుతుంది తెలుగుదేశం పార్టీ నాయకుల్లోనూ కార్యకర్తల్లోనూ ఇదే టాపిక్ గా మారింది గత కొద్ది రోజులుగా మాజీ కౌన్సిలర్ అబ్రహం పేరు ప్రచారంలో ఉంది దివంగత మంత్రి వీరారెడ్డి ఐ యాం నుంచి ఇప్పటివరకు అబ్రహం కుటుంబం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతుంది అబ్రహం తండ్రి సమ్మెట ఐజయ్య దివంగత వీరారెడ్డి భక్తుడు అని చెప్పాలి ఆయన రాజకీయ జీవితం తెలుగుదేశం పార్టీతోనే మొదలైందని చెప్పాలి చెప్పాలి ఆయన కుమారుడు మాజీ కౌన్సిలర్ అబ్రహం ఆయన కుటుంబ సభ్యులు ఇదే బాటలో నడుస్తున్నారు బద్వేల్ అసెంబ్లీ రిజర్వు కావడంతో 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేయాలని అబ్రహం భావిస్తున్నారు భావి ఈ మేరకు పార్టీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు పార్టీ యువ నేత రితేష్ కుమార్ రెడ్డి ఆశీస్సుల కోసం అబ్రహం ప్రయత్నాలు ముమ్మరం చేశారు కాగా అబ్రహం పేరు పార్టీ ముఖ్య నేతల దృష్టిలో ఉన్నట్లు సమాచారం క్షేత్రస్థాయిలో కూడా అబ్రహం పట్టు సాధించుకునేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అప్పట్లో డాక్టర్ రాజశేఖర్ కు టికెట్ ఇవ్వడం జరిగింది అప్పట్లో ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు విజయం సాధించలేకపోయారు ఇటీవల జరిగిన బద్వేల్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా డాక్టర్ రాజశేఖర్ ను పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తరలించారు కానీ అప్పటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు కారణాలు ఏవైనా ఇప్పుడు డాక్టర్ రాజశేఖర్ ను తెలుగుదేశం పార్టీ గత కొన్ని నెలలుగా దూరం పెట్టింది ఆయన తెలుగుదేశం పార్టీ చేపట్టే ఏ కార్యక్రమంలోనూ పాల్గొనడం లేదు పార్టీ అధిష్టానం కూడా ఆయనను ఏ కార్యక్రమానికి పిలవడం లేదు గత ఏడాది డిసెంబర్ 25వ తేదీ జరిగిన దివంగత మంత్రి వీరారెడ్డి వర్ధంతి వేడుకల్లో కూడా డాక్టర్ రాజశేఖర్ పాల్గొనలేదు ఈ విషయం తెలుగుదేశం పార్టీ నాయకులు సీరియస్ గా తీసుకున్నట్లు సమాచారం ఈ నేపథ్యంలో 2024 లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కొత్త వ్యక్తి పోటీలో ఉంటారని సమాచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అబ్రహం పేరు విస్తృతంగా వినిపిస్తుంది అబ్రహం కూడా ఈ మేరకు తన ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలతో అబ్రహం కు మంచి రాజకీయ సంబంధాలు ఉన్నాయి అబ్రహం తండ్రి ఐజియ సోదరుడు అనిల్ ఎప్పుడు తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో ముందుంటారు

## ప్రజలు విద్యుత్ ను పొదుపు చేయాలి

:::ఏ డి పురుషోత్తంగ్రామాల్లో ఆకస్మిక తనిఖీ చేసిన విద్యుత్ శాఖ అధికారులు

తనిఖీ ల్లో పాల్గొన్న ఏ. ఈ నరసన్న ఆదోని రూరల్ ఏ. ఈ నాగభూషణ్



కౌతాళం మండల పరిధిలో గ్రామం లో విద్యుత్ శాఖ ఏడి పురుషోత్తం కౌతాళం మండల పరిధిలో చుట్టూ పక్కల పలు గ్రామంలో సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరిగేరి, కౌతాళం, బంటకుంట, సులేకరి. కాత్రికి గ్రామ లొ ప్రతి యొక్క ఇంటికి తిరిగి డి.టి కేస్, చెక్ రీడింగ్ టెప్ట్ కేస్ రాసినారు. మరియు మీటర్ లొ ఉన్న అధిక లోడ్ తనిఖీ చేశారు. అలాగే ప్రజలకు విద్యుత్ పొదుపు చేయాలన్నారు. అలాగే ప్రతియొక్క వినియోగందారులు మొండి విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలని చెప్పారు. లేని పక్షంలొ వారి ఇంటి కనెక్షన్ తొలగించబడతాయి తెలియజేశారు. తనిఖీ లొ విద్యుత్ సిబ్బంది కరీంబాషా. రాజేష్, యల్లప్ప గౌడ్, శేఖర్, హరేంద్ర. పాల్గొన్నారు.

## వాలంటీర్ల లో టీడీపీ సానుభూతిపరులు ఉంటే తక్షణమే తొలగిస్తాం

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కీలక వ్యాఖ్యలు

ఎన్టీఆర్ జిల్లా ఫిబ్రవరి 20 మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ల లో టీడీపీ సానుభూతిపరులు ఉంటే వారిని తక్షణమే తొలగిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన సమయంలో టీడీపీ సానుభూతిపరులకు కూడా వాలంటీర్లుగా అవకాశం కల్పించామన్నారు. వారు మారతారేమోనని వేచిచూశామన్నారు. కానీ వారిలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. కొంతమంది మారారని, మరికొంతమది మారలేదన్నారు. అటువంటివారిని సొంత నాయకులు గుర్తించి.. చెబితే వెంటనే వారిని తొలగిస్తామని వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్గా మారాయి.ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ నిన్న (ఆదివారం) కొండపల్లిలో గృహసారథులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు అనుబంధంగా ఉంటూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి ఆనాడు జగన్ ఈ వాలంటీర్లను ఏర్పాటు చేశారు.అయితే గత కొంతకాలంగా మంత్రులు, ఎమ్మెల్యేలు.. వాలంటీర్లను కార్యకర్తలుగా చూస్తున్నారు. ఎవరు ప్రభుత్వాన్ని ప్రశ్నించినా.. వారిని వెంటనే తొలగించాలని చెబుతున్నారు. మంత్రులు గతంలో చేసిన ఈ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.

# పుష్ప 2 లేటెస్ట్ అప్డేట్.. రిలీజ్ ఎప్పుడంటే?



పుష్ప.. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ టాలెంటెడ్ యాక్టర్ అల్లు అర్జున్ లాంటి క్రేజీ కాంబోలో వచ్చిన సినిమా. పుష్ప -1 ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఒక్క సినిమాతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. లెక్కల మాస్టారు తెరకెక్కించిన ఈ మూవీ నార్త్ లోనూ సూపర్ డూపర్ హిట్ అయింది.ప్రస్తుతం పుష్ప -2 పై భారీగా అంచనాలు నెలకొన్నాయి. అందుకే బన్నీ కూడా మరో కొత్త ప్రాజెక్టు ఏదీ ప్రకటించకుండా పుష్ప 2 కోసమే తన మొత్తం సమయాన్ని కేటాయిస్తున్నాడు. పుష్ప 2 సినిమా అప్డేట్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆత్రుతగా వెయిట్ చేస్తున్నారు.ఫస్ట్ లుక్ పోస్టర్ టీజర్ ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా అని చాలా ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పుడు పుష్ప 2 నుండి ఓ అప్డేట్ వచ్చింది. ఈ సినిమాను ఎప్పుడు రిలీజ్ అవనుందో చెప్పేసినట్లు తెలుస్తోంది.షూటింగ్ పోస్టు ప్రొడక్షన్ వర్క్ ప్రమోషన్స్ అన్నీ పూర్తి చేసుకుని పుష్ప 2 రిలీజ్ కావాలంటే నెక్స్ట్ ఇయర్ అవుతుందట. అంటే 2024 సమ్మర్ లో ఇంకా క్లారిటీగా చెప్పాలంటే 2024 మార్చి 2వ తేదీన పుష్ప 2 మూవీ రిలీజ్ చేసేందుకు మూవీ టీమ్ సన్నాహాలు చేస్తోందట.షూటింగ్ కు ఎంత సమయం అవసరమో పోస్టు ప్రొడక్షన్ ప్రమోషన్స్ కు అంత సమయం పట్టేలా ఉందని టాక్ నడుస్తోంది. అలాగే పుష్ప 2 టీజర్ కోసం.. ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆగాల్సిందేనని ఇప్పటికే మూవీ టీమ్ హింట్ ఇచ్చింది. బన్నీ పుట్టిన రోజు సందర్భంగా పుష్ప 2 మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇవ్వనున్నట్లు సమాచారం.పుష్ప 2 మూవీ ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోంది. పుష్ప పార్టు 1 తో పోలిస్తే.. పార్టు 2 మరింత గ్రాండ్ గా ఉండేలా క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. షూటింగ్ ప్రస్తుతం విశాఖపట్నంలో ఏరియాలో జరుగుతోంది. రీసెంట్ గా హీరో ఇంట్రడక్షన్ సాంగ్ ను ప్రత్యేకంగా వేసిన సెట్ లో షూట్ చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే రష్మిక మందన్నా పుష్ప 2 సెట్లోకి అడుగు పెట్టనుంది.

# అల వైకుంఠపురంలో ఫ్లాప్ అయినట్లేనా..?

అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో కరోనాకు ముందు వచ్చిన అల వైకుంఠపురంలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఇండస్ట్రీ హిట్ గా నిలిచిన అల వైకుంఠపురం లో సినిమా నాటకీయ పరిణామాల మధ్య హిందీలో రీమేక్ అయ్యింది. మొదట డబ్బింగ్ చేసి డైరెక్ట్ యూట్యూబ్ లో స్ట్రీమింగ్ చేయాలని భావించారు.. కానీ రీమేక్ చేసేందుకు సిద్ధం అయ్యారు.కార్తీక్ ఆర్యన్ హీరోగా రోహిత్ ధావన్ దర్శకత్వంలో ఈ రీమేక్ రూపొందింది. షెహజాదా టైటిల్ తో హిందీలో రూపొందిన అల వైకుంఠపురంలో సినిమా మొన్న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి రోజు



కలెక్షన్స్ ను చూస్తూ ఉంటే సినిమా ఫ్లాప్ అయినట్లే అనే అభిప్రాయం ను మీడియా సర్కిల్స్ వారు వ్యక్తం చేస్తున్నారు.మొదటి మూడు రోజుల వసూళ్ల రిపోర్ట్ వస్తే అసలు ఫలితం పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కార్తీక్ ఆర్యన్ యొక్క గత చిత్రం భూల్ భులయ్యా 2 యొక్క కలెక్షన్స్ తో పోల్చితే షెహజాదా సినిమా వసూళ్లు చాలా తక్కువగా నమోదు అవుతున్నాయి అంటూ బాక్సాఫీస్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.భూల్ భూలయ్య 2 సినిమా మొదటి రోజు దాదాపుగా రూ.14 కోట్ల రూపాయల వసూళ్లు నమోదు చేసింది. కానీ షెహజాదా చిత్రం మాత్రం అందులో సగం అంటే రూ.7 కోట్లను మాత్రమే వసూళ్లు చేసినట్లుగా బాక్సాఫీస్ రిపోర్ట్ అందుతోంది. అల వైకుంఠపురంలో వందల కోట్ల వసూళ్లు సాధిస్తే రీమేక్ మరీ ఇంత తక్కువ ఓపెనింగ్స్ రాబట్టడం విడ్డూరంగా ఉంది.ముందు ముందు కూడా ఈ సినిమా యొక్క కలెక్షన్స్ భారీగా ఉంటాయని భావించడం లేదని ప్రముఖ బాక్సాఫీస్ విశ్లేషకులు చెబుతున్నారు. లాంగ్ రన్ లో 25 కోట్ల రూపాయల వరకు ఈ సినిమా రాబడుతుందేమో.అంతకు మించి ఈ సినిమా వసూళ్లు చేయకపోవచ్చు అంటున్నారు. కనుక అల వైకుంఠపురంలో హిందీ వర్షన్ ఫ్లాప్ అయినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఫుల్ రన్ తర్వాత కానీ సినిమా యొక్క అసలు ఫలితం పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# కొలనులో అమలా పాల్ తడి అందాలు..

అందం అభినయం కలగలిపిన తారల్లో నటి అమలాపాల్ ఒకరు. ఓ వైపు గ్లామర్ పాత్రలను చేస్తూనే మరోవైపు నటనకు ప్రాధానత్య ఉన్న పాత్రలో నటిస్తోంది. ఆకట్టుకునే అందం.. అద్భుతమైన నటన.. మెస్మరైజ్ చేసే హావభావాలు ఈమె సొంతం. సాదాసీదాగానే సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ..



చాలా తక్కువ సమయంలోనే స్టార్ డం సొంతం చేసుకుంది.తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా క్రేజ్ మాత్రం బాగానే వచ్చింది. నాగ చైతన్య బెజవాడ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ బ్యూటీ.. ఆ తరువాత రాంచరణ్ తో నాయక్ అల్లు అర్జున్ తో ఇద్దరమ్మాయిలతో నానితో జెండా పై కపిరాజు వంటి సినిమాల్లో నటించింది.కెరీర్ మంచి పీక్స్ లో ఉన్న సమయంలో తమిళ దర్శకుడు ఏ.ఎల్.విజయ్ ను పెళ్లి చేసుకుని సినిమాలకు బ్రేక్ ఇచ్చింది.అనంతరం అతడితో విడాకులు తీసుకొని మళ్ళీ సినిమాలను స్టార్ట్ చేసింది.అయినా కూడా ఎందుకో కానీ ఇక్కడ చెప్పుకోదగ్గ అవకాశాలు అయితే రాలేదు ఈ ముద్దుగుమ్మకు. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో గ్లామర్ డోస్ ను విపరీతంగా పెంచేసింది.ఎప్పటికప్పుడు కొత్త ఫోటో షూట్లను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. అందాలతో అదరగొడుతోంది. తాజాగా కొన్ని ఫోటోస్ ను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఓ నీటి కొలనులో ఎర్రటి చీరలో ప్రార్థిస్తూ అందంగా కనిపించింది. "నేను మార్చలేని వాటిని అంగీకరించడానికి నీటి శక్తిని ప్రసాదించు. నేను చేయగలిగే వాటి కోసం అగ్ని శక్తి ధైర్యన్ని ఇవ్వు. తేడా తెలుసుకునే సామర్థ్యం కోసం గాలి శక్తి నివ్వు. నా మార్గాన్ని తెలుసుకొని ముందుకు నడిచేలా భూమి శక్తిని నాకు ప్రసాదించు. నన్ను ఆశీర్వదించు" అంటూ రాసుకొచ్చింది.ఇది చూసిన నెటిజన్లు పవర్ ఫుల్ బ్యూటీ ఎంతో అందంగా ఉందో నా కలల రాణి రెడ్ డ్రెస్ హాట్ గా మై ఏంజెల్ అంటూ విపరీతంగా కామెంట్లు చేస్తున్నారు. కాగా అమలా పాల్ ప్రస్తుతం ద్విజ ఆడు జీవితం భోళా అధో అంధ పర్వై పోల చిత్రాల్లో నటిస్తోంది. త్వరలోనే ఇవి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# రోహిత్ చేసిందేమీ లేదు.. కేవలం కోహ్లిని ఫాలో అవుతున్నాడంతే!

ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా నాలుగు మ్యాచ్ల టెస్టు సిరీస్లో



2-0 ఆధిక్యంలో దూసుకెళ్లింది.అంతేకాకుండా వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్కు చేరేందుకు మార్గం మరింత సుగమం అయ్యింది. ఇక పరిమిత ఓవర్లలో టీమిండియా సారథిగా విజయవంతమైన రోహిత్ శర్మ.. టెస్టుల్లో కూడా జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు.అయితే, జట్టు పగ్గాలు చేపట్టిన తర్వాత కేవలం రెండు టెస్టులు మాత్రమే ఆడిన ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. కెప్టెన్గా పూర్తి స్థాయి టెస్టు సిరీస్ ఆడటం ఇదే తొలిసారి అయినా రోహిత్ తన ముద్ర వేయగలిగాడు. ఆసీస్తో తొలి రెండు టెస్టుల్లో కెప్టెన్గానే కాకుండా బ్యాటర్గా కూడా హిట్మ్యాన్ అద్భుతంగా రాణించాడు.తొలి టెస్టులో సెంచరీతో చెలరేగిన రోహిత్.. రెండు టెస్టులో కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇక తొలి రెండు టెస్టుల్లో సారథిగా ఆస్ట్రేలియాను మట్టికరిపించిన రోహిత్ శర్మపై సర్వాత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ కెప్టెన్సీ గురించి భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ఆసక్తికర వాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల టెస్ట్ కెప్టెన్సీ మధ్య పెద్దగా తేడాలు లేవని గంభీర్ అభిప్రాయపడ్డాడు. టెస్టుల్లో సారథిగా కోహ్లి వ్యూహాలనే రోహిత్ అనుసరిస్తున్నాడని అతడు చెప్పుకొచ్చాడు.'నిజం చెప్పాలంటే.. రోహిత్ శర్మ అద్భుతమైన కెప్టెన్. కానీ రెడ్బాల్ క్రికెట్లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ మధ్య పెద్దగా తేడా లేదు. గతంలో విరాట్ కూడా ఇటువంటి వ్యూహాలనే రచించేవాడు. ఇప్పుడు రోహిత్ కూడా విరాట్ శైలినే అనుసరిస్తున్నాడు. అయితే కెప్టెన్గా రోహిత్కు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ల పర్యటనలకు వెళ్లినప్పుడు అసలైన సవాలు ఎదురవుతుంది.ఎందుకంటే గతంలో కోహ్లికి కూడా విదేశీ పర్యటనలో చాలా సవాళ్లు ఎదురయ్యాయి. కానీ అక్కడ విరాట్ సారథిగా విజయవంతమయ్యాడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రోహిత్, విరాట్లలో ఎవరు అత్యుత్తమ కెప్టెన్ అని ఇప్పుడు నేను చెప్పలేను. ఎందుకంటే రోహిత్ విదేశీ గడ్డపై సారథిగా ఎలా రాణిస్తాడో ఇప్పుడే నేను అంచనా వేయలేను" అని స్టార్స్పోర్ట్స్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190